సందిగ్ధంలో సమీకృత మార్కెట్ నిర్మాణం!

స్లాబ్ దశలోనే నిలిచిపోయిన కూరగాయల మార్కెట్ కోసం నిర్మిస్తున్న భవనం

- నిధుల విడుదలలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం
- బిల్లులందక పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్
- మరో వైపు లీజుకు తీసుకున్న స్థలంపై పేరుకుపోతున్న అద్దె

మెట్‌పల్లి, జనవరి 29: పట్టణంలో వెజ్, నాన్‌వెజ్ క్రయ, విక్రయదారుల కోసం చేపట్టిన సమీకృత మార్కెట్ నిర్మాణం సందిగ్ధంలో పడింది. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. మరో వైపు మార్కెట్ ఏర్పాటు కోసం తీసుకున్న ఖాదీ స్థలానికి లీజు (అద్దె) చెల్లింపునకు మున్సిపల్ సుముఖంగా లేదు. కూరగాయలు, మాంసం మార్కెట్లు ఒకే చోట అన్ని వసతులతో ప్రజలకు అందుబాటులో ఉండాలనే సదుద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం సమీకృత మార్కెట్ల ఏర్పాటుకు సంకల్పించింది. ఇందులో భాగంగా మెట్‌పల్లి పట్టణంలో సమీకృత మార్కెట్ ఏర్పాటు కోసం పురపాలక, పట్టణ అభివృద్ధి శాఖ టీయూఎఫ్ఐడీసీ నుంచి నిధులు మంజూరు చేసింది. మార్కెట్ ఏర్పాటుకు అవసరమైన స్థలం కోసం అన్వేషణ చేశారు. ప్రభుత్వానికి సంబంధించి గాని మున్సిపల్‌కు సంబంధించి గాని అనువైన స్థలం లేకపోవడంతో వెల్లుల్ల రోడ్డులోని ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్ఠాన్‌కు చెందిన స్థలం ఎంపిక చేశారు. ఎకరం 20 గుంటల స్థలం మున్సిపాలిటీకి లీజుకు ఇచ్చేందుకు ఖాదీ ప్రతిష్ఠాన్ కూడా అంగీకరించింది. లీజుకు సంబంధించి మొదటి రెండేళ్ల వరకు నెలకు రూ.1.50 లక్షల చొప్పున అద్దె చెల్లింపు, ఆ తర్వాత ప్రతి రెండేళ్లకోసారి 10 శాతం అద్దె పెంపునకు ఆమోదం తెలుపుతూ 2021 మార్చి 21న మున్సిపల్ కౌన్సిల్ కూడా ఆమోదం తెలిపింది. 2021 జూన్ 7న అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా లీజుకు తీసుకున్న స్థలంలో సమీకృత మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మొదటగా రూ. 6.5 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు ప్రారంభించగా, ఆ తర్వాత మరో రూ.4.35 కోట్లు కేటాయించారు. కూరగాయల క్రయ, విక్రయాల కోసం రెండు, మాంసం విక్రయాల కోసం ఒక బ్లాక్‌ను నిర్మిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు కేవలం ఒక బ్లాక్ మాత్రమే పూర్తి దశకు చేరుకోగా, మిగతా రెండు బ్లాకులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పటికే చేసిన పనులకు బిల్లులు రాలేదనే కారణంతో కాంట్రాక్టర్ పనులు నిలిపేశారు. టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.10.85 కోట్ల అంచనా వ్యయంతో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు చేపట్టగా ఇప్పటి వరకు 40 శాతం నిధులు విడుదలైనట్లు సమాచారం. ప్రస్తుత ప్రభుత్వం నిధుల విడుదలలో జాప్యం చేస్తుండడంతో పనులు ముందుకు సాగడం లేదు.

తడిసి మోపెడవుతున్న అద్దె

సమీకృత మార్కెట్ ఏర్పాటు కోసం లీజుకు తీసుకున్న స్థలానికి సంబంధించి అద్దె తడిసి మోపెడవుతున్నది. ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్ఠాన్, మున్సిపల్ కౌన్సిల్ మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం.. 2022 ఏప్రిల్ నుంచి లీజు అమలులోకి వచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.50 లక్షలకు పైగా అద్దె పెండింగ్‌లో ఉంది. కాగా, అద్దె కోసం ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్ఠాన్ అధికారులు నోటీసులు జారీ చేస్తూనే ఉన్నారు. కానీ, అద్దె మాత్రం చెల్లించడం లేదు.

సీడీఎంఏ దృష్టికి తీసుకెళ్లాం

సమీకృత మార్కెట్ కోసం లీజుకు తీసుకున్న స్థలానికి సంబంధించి అద్దె చెల్లింపు మున్సిపల్‌పై ఆర్థిక భారం పడుతున్నది. ఖాదీ నుంచి నోటీసులు వచ్చిన విషయం వాస్తవమే. కానీ అంత పెద్దమొత్తంలో అద్దె చెల్లించే పరిస్థితి లేదు. ఈ విషయం సీడీఎంఏ దృష్టికి తీసుకెళ్లాం. ఇంకా తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. మరో వైపు బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ నిర్మాణ పనులు నిలిపివేసిన విషయం ఉన్నతాధికారులకు నివేదించాం.

- మోహన్, మున్సిపల్ కమిషనర్, మెట్‌పల్లి

పెన్షనర్ల గోడు పట్టించుకోని కేంద్రం

- ఆదాయ పన్ను మినహాయింపు కోసం ఎనిమిదేళ్లుగా ఆందోళనలు
- ఫిబ్రవరి ఒకటిన పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే కొత్త ఆదాయ పన్ను బిల్లుపై ఆశలు

పోస్టుకార్డులను తపాలా డబ్బాలో వేస్తున్న సీనియర్ సిటిజన్లు

జగిత్యాల, జనవరి 29: తమను ఆదాయ పన్ను నుంచి మినహాయించాలని తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్లు ఎనిమిదేళ్లుగా ఆందోళనలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు జరిగే కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో కొత్త ఆదాయ పన్ను బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ నేపథ్యంలో కొత్త ఆదాయ పన్ను చట్టంలోనైనా తమకు ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఇస్తారనే ఆశతో పెన్షనర్లు ఎదురుచూస్తున్నారు. గత ఎనిమిదేళ్లుగా కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల్లో తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య ఆధ్వర్యంలో పెన్షనర్లకు ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వాలని ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థికశాఖ మంత్రికి పోస్ట్ కార్డులపై వినతులు పంపుతున్నారు. కలెక్టర్, ఆర్డీవో కార్యాలయాల ఎదుట ప్రతి ఏటా బడ్జెట్ ప్రవేశ పెట్టడానికి ముందు ధర్నాలు చేస్తున్నారు. తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లాలోని పెన్షనర్లు ఎనిమిదేళ్లుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నాలు కూడా చేపట్టారు. పెన్షనర్ల జేఏసీ కేంద్ర కమిటీ చైర్మన్ గాజుల నర్సయ్య ఆధ్వర్యంలో ఢిల్లీలో కేంద్ర ఆర్థికమంత్రి, ఎంపీలకు వినతి పత్రాలు సైతం అందజేశారు. ఈసారి కూడా తమ ఆశలు వమ్ము చేస్తే, మార్చి మొదటి వారంలో ఆందోళనలు చేపడుతామని పేర్కొన్నారు.

ఆదాయ పన్ను నుంచి మినహాయించాలి

రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రతి నెలా ప్రభుత్వం ఇచ్చే గౌరవ భృతి పెన్షన్‌పై ఆదాయ పన్ను విధించడం సరికాదు. ఉద్యోగులకు సైతం ఆదాయ పన్ను పరిమితి రూ.16 లక్షలకు పెంచాలి. ఫిబ్రవరి ఒకటిన ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్‌లో పెన్షనర్లకు ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలి. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతం.

-హరి అశోక్‌కుమార్, పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు

గొల్లపల్లి, జనవరి 29: మండల కేంద్రంలోని సర్వే నంబర్ 735లో గల ప్రభుత్వ భూమిలో ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఆరు నెలల్లోనే సుమారు 100 ఇండ్లు నిర్మించారు. కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, బుధవారం తహసీల్దార్ వరదన్ వెళ్లి నిర్మించిన ఇండ్లను సందర్శించి, ఆక్రమణదారులతో మాట్లాడారు. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు.

మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

పెగడపల్లి, జనవరి 29: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గత నెల 30న 'ఒంటికి వస్తే బయటకే' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో వచ్చిన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణ పనులకు ఉపాధి హామీ పథకం నుంచి రూ. 4 లక్షలు కేటాయించగా, పనులు వేగంగా జరుగుతున్నాయి. నెల రోజుల్లో పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. కాగా, విద్యార్థుల సంఖ్యకు ఇవి సరిపోవని, మరికొన్ని మరుగుదొడ్లు నిర్మించాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

విద్యుత్ కంచె తాకి అడవి పంది మృతి

కథలాపూర్, జనవరి 29: కథలాపూర్ మండలం చింతకుంట గ్రామశివారులో పంట పొలానికి ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె తాకి అడవిపంది మృతిచెందినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. మండలంలోని భూషణరావుపేట గ్రామానికి చెందిన తిరుపతినాయక్ చింతకుంట శివారులో వరి సాగు చేస్తున్నాడు. పంట పొలం చుట్టూ విద్యుత్ కంటె ఏర్పాటు చేశారు. కంచెకు తాకి అడవిపందితో పాటు రెండు గొర్రెలు మృతిచెందాయన్నారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ కోరుట్ల డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సురేశ్‌కుమార్, బీట్ ఆఫీసర్లు శివరాజ్, సాయిరాం, శ్రావణ్ బుధవారం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. తిరుపతినాయక్‌పై కేసు నమోదు చేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. కాగా, అడవి పంది కళేబరానికి పశువైద్యాధికారులు దివ్యశ్రీ, శ్రీనివాస్ పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం ఖననం చేసినట్లు అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

మల్లాపూర్, జనవరి 29: మండలంలోని మొగిలిపేట మాజీ సర్పంచ్ వనతడపుల నాగరాజు గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబధించిన బిల్లులు రాకపోవడంతో ఆత్మహత్యా యత్నం చేసుకోవడం బాధాకరమని మండల విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. మాజీ సర్పంచులు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ఎగ్గారపు వెంకటేశ్వర్లు, పొలాస రాజయ్య, పిప్పోజి శ్రీనివాస్, దొంతి సుధాకర్, తుమ్మలపల్లి వెంకటరమణ, మానాల శ్రీనివాస్, దొంతి సుభాశ్, తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటకు తరలిన భవన నిర్మాణ కార్మికులు

జగిత్యాల, జనవరి 29: సిద్దిపేటలో జరుగుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం, బీఎంఎస్ రాష్ట్ర రెండో మహాసభలకు జిల్లా నుంచి భవన నిర్మాణ కార్మికులు బస్సులో తరలివెళ్లారు. బస్సును విశ్వహిందూ పరిషత్ పూర్వ నాయకుడు క్యాదాసు నాగయ్య జెండా ఊపి ప్రారంభించారు. తరలి వెళ్లిన వారిలో బీఎంఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుడు సుధీర్‌కుమార్, కన్‌స్ట్రక్షన్ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎదులాపురం సత్యనారాయణ, బీడీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, జైన శంకర్, కిషన్, నేరెళ్ల రాజేశం, రమేశ్, శిరీష, రమ, యాదగిరి, భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు.

'ఆత్మీయ భరోసా'తో అవస్థలు

ఎంపీడీవో చిరంజీవికి వినతిపత్రం అందజేస్తున్న ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు

- ఉపాధిహామీ కూలీలతో చివాట్లు తింటున్నాం
- రాయికల్ ఎంపీడీవోకు ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి
- సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి

రాయికల్, జనవరి 29: కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంతో తాము నిత్యం అవస్థలు పడుతున్నామని ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు వాపోతున్నారు. తాము కూడా ఉపాధి హామీ పనికి వచ్చామని.. తమనెందుకు ఎంపిక చేయలేదంటూ పలు గ్రామాల ప్రజలు దూషించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. ఇష్టమైన వారి పేర్లను మాత్రమే ఎంపిక చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో తమకు సంబంధం లేకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జగిత్యాల జిల్లా రాయికల్‌లో ఎంపీడీవో చిరంజీవికి బుధవారం ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు వినతి పత్రం అందజేశారు. తమ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన లబ్ధిదారులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండలాధ్యక్షుడు భూక్యా తిరుపతి, సభ్యులు మహ్మద్ నసీర్, కనికరపు లక్ష్మణ్, మహేశ్, మల్లేశం, శ్రీనివాస్, నర్సయ్య, తిరుపతి, రవి తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల బృహత్ ప్రణాళిక కోసమే డ్రోన్ సర్వే

డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న మున్సిపల్ ప్రత్యేకాధికారి గౌతమ్‌రెడ్డి

కోరుట్ల, జనవరి 29: కోరుట్ల పట్టణ బృహత్ ప్రణాళిక కోసమే డిజిటల్ డ్రోన్ సర్వే నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ ప్రత్యేకాధికారి, అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి అన్నారు. కోరుట్ల పట్టణంలోని అయిలాపూర్ రోడ్డులో అమృత్ 2.0 పథకం ద్వారా సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నూతన మాస్టర్ ప్లాన్ తయారీ కోసం డిజిటల్ డ్రోన్ సర్వేను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడారు. పట్టణంలో 28 లోకేషన్ పాయింట్ల నుంచి డిజిటల్ డ్రోన్ సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. సర్వేతో ప్రభుత్వ ఆస్తులకు రక్షణ లభిస్తుందని పేర్కొన్నారు. సర్వే ద్వారా చెరువులు, కుంటలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల వారీగా హద్దులు నిర్ణయించేందుకు వీలుంటుందని చెప్పారు. జీఐఎస్ సర్వే అన్ని ప్రభుత్వ శాఖల భవిష్యత్ కార్యక్రమాలకు ఆధారంగా నిలుస్తుందని తెలిపారు. డ్రోన్ సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, పట్టణ ప్రణాళిక అధికారి ప్రవీణ్‌కుమార్, మేనేజర్ శ్రీనివాస్, టీపీఎస్ రమ్య, డ్రోన్ సర్వేయర్ గోపాల్‌రావు ఉన్నారు.

విలీన ప్రక్రియ వేగవంతం

కార్పొరేషన్, జనవరి 29: విలీన గ్రామాలు, కొత్తపల్లి మున్సిపాలిటీని పూర్తిస్థాయిలో కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోకి తీసుకువచ్చే ప్రక్రియ వేగవంతమైంది. సీడీఎంఏ ఈ కార్యక్రమాన్ని వచ్చే నెల 6లోగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో నగరపాలక అధికారులు దీనికి సంబంధించి చర్యలు ప్రారంభించారు. కొత్తపల్లి మున్సిపాలిటీతో పాటు గ్రామాల్లోని అధికారుల నుంచి ఆయా రికార్డులను స్వాధీనం చేసుకోవడానికి నగర కమిషనర్ బల్దియాలోని వివిధ విభాగాల అధికారులకు బాధ్యతలు అప్పగించారు. వీరు ఆయా గ్రామాల్లో ప్రత్యేకాధికారుల నుంచి ఆ గ్రామాలకు సంబంధించిన రికార్డులు స్వాధీనం చేసుకుంటారు. ఈ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి సీడీఎంఏకు నివేదికను పంపించేందుకు నగరపాలక అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం నుంచే రికార్డులు స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో కొత్తపల్లి మున్సిపాలిటీకి సంబంధించి డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి, చింతకుంట గ్రామానికి అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, మల్కాపూర్, లక్ష్మీపూర్‌కు సూపరింటెండెంట్ సునీల్‌కుమార్, బొమ్మకల్‌కు ఇన్‌చార్జి ఏసీపీ వేణు, దుర్శేడ్‌కు సూపరింటెండెంట్ సంజీవ్‌కుమార్, గోపాల్‌పూర్‌కు డీఈ వెంకటేశ్వర్లకు బాధ్యతలు అప్పగించారు. వీరు మున్సిపల్, ఆయా గ్రామాల పంచాయతీలకు వెళ్లి అక్కడి ప్రత్యేకాధికారుల నుంచి పూర్తిస్థాయిలో రికార్డులను స్వాధీనం చేసుకోనున్నారు. రెండు రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసి అన్ని రికార్డులను మున్సిపాలిటీకి అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు. విలీన ప్రక్రియ పూర్తి అయినా తర్వాత పూర్తి వివరాలతో వచ్చే నెల 6లోగా సీడీఎంఏకు నివేదిక అందించనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

వార్డు కార్యాలయాలుగా.. జీపీలు

కరీంనగర్ రూరల్, జనవరి 29: కరీంనగర్ మండలం బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామాలను కరీంనగర్ నగరపాలక సంస్థలో విలీనం కాగా, బుధవారం నగర పాలక అధికారులు ఆయా జీపీల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలకు నగరపాలక సంస్థ వార్డు కార్యాలయాలుగా బోర్డులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కరీంనగర్ మండల పంచాయతీ అధికారి జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అపార్‌లో జిల్లాను ముందువరుసలో నిలుపాలి

కమాన్‌చౌరస్తా/కరీంనగర్ రూరల్, జనవరి 29 : కరీంనగర్ మండల విద్యా వనరుల కేంద్రంలో జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు ఆధ్వర్యంలో జిల్లాలోని మండల విద్యాధికారులతో అపార్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ, అపార్‌లో జిల్లాను రాష్ట్రంలో ముందువరుసలో నిలుపాలని సూచించారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

- రేషన్ కార్డు దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ
- శ్మశానవాటిక, మినీ స్టేడియంలో చెత్తను తొలగించాలి
- కలెక్టర్ సత్యప్రసాద్

డంప్ యార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

మెట్‌పల్లి, జనవరి 29: ఉద్యోగులు సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించి ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని తెలిపారు. ప్రజలు ఇచ్చిన దరఖాస్తుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. పట్టణంలోని మినీ స్టేడియంలో నిలిచిన భవన నిర్మాణాలు, సింగపూర్ సమీపంలోని వైకుంఠధామాన్ని పరిశీలించారు. మినీ స్టేడియంలో చెత్త, పిచ్చిమొక్కలను తొలగించి, పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైకుంఠధామం ఆవరణలో నీటి సదుపాయం కల్పించాలని, ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించి శుభ్రపరచాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. డంప్ యార్డును పరిశీలించిన ఆయన తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి నిల్వ చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మోహన్, డీఈఈ నాగేశ్వర్‌రావు, శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రత్నాకర్ తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

వాస్తు చూడబడును

★వాస్తు చూడటం, ఇంటి మోడల్ ప్లానులు తీయడం, భూమి కొలతలు తీయడం,ఆటోక్యాడ్‌లో డ్రాయింగ్ చేయడం నేర్పబడును, వాస్తు చూడబడును. సంప్ర|| M. రాజేష్, సెల్ : 9502438614
NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

దళితుల ఆనందహేల

జమ్మికుంట/హుజూరాబాద్ టౌన్, జనవరి29: నిత్య పోరాటాలతో ప్రభుత్వం దిగొచ్చి దళిత బంధు రెండో విడుత నిధులపై ఫ్రీజింగ్ ఎత్తివేయడంపై లబ్ధిదారులు, బీఆర్ఎస్ నాయకులు ఆనందపడ్డారు. బుధవారం హుజూరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా సంబురాలు జరుపుకొన్నారు. జమ్మికుంటలోని తెలంగాణ చౌక్ వద్ద దళిత సంఘం నాయకుడు మంద రాజేశ్ ఆధ్వర్యంలో 'దళిత బంధు'వులు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అలాగే హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కౌశిక్ రెడ్డి ఫ్లెక్సీకి బీఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఆయాచోట్ల నాయకులు మాట్లాడారు. 'దళిత బంధు' ద్వారా దళిత కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపింది తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అయితే.. దళిత కుటుంబాల పక్షాన కొట్లాడి దళిత బంధు పథకం రెండో విడుత నిధులు విడులయ్యేలా కొట్లాడిన ఘనత ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిదంటూ కొనియాడారు. రెండో విడుత విడుదలయ్యేంత వరకు దళితుల పక్షాన నిలబడిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. జమ్మికుంటలో నాయకులు రాచపల్లి అనిల్, రాం చంద్రమౌళి, చారపల్లి రాకేశ్, బండారి ప్రశాంత్, పాత రాజేశ్, గుల్లి ప్రభాకర్, కొత్తూరు విజయ్, గణపతి, ఎర్ర రాజేశ్, ప్రశాంత్, రాజు ఉన్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు ముక్క రమేశ్, మారెపెల్లి సుశీల, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మొలుగు పూర్ణచందర్, కేసరి మధుకర్ రావు, మోతె మధు, ఎర్రశ్రీధర్ పాల్గొన్నారు.

నేషనల్ లెవెల్ పోటీలకు సైనిక పాఠశాల విద్యార్థి

చొప్పదండి, జనవరి 29: మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక పాఠశాల రుక్మాపూర్‌కు చెందిన 12వ గ్రేడ్ విద్యార్థి మాస్టర్ కె.బలరాం నేషనల్ లెవెల్ టెన్నీకాయిట్ జూనియర్ చాంపియన్ షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ కల్నల్ కేసీ రావు, ప్రిన్సిపాల్ కాళహస్తి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌లోని సెయింట్ అల్ఫోన్స్ పాఠశాలలో జరిగిన టెన్నీకాయిట్ రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి, ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 3 వరకు చెన్నైలో జరిగే నేషనల్ లెవెల్ టెన్నీకాయిట్ జూనియర్ చాంపియన్ షిప్‌కు కె.బలరాం అర్హత సాధించాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్‌తో పాటు ఎస్‌వీపీ శ్రీనివాస్, జేవీపీ ప్రమోద్ రాజు, పీడీ ఇనాక్ బాలసుందర్‌రావు, పీఈటీ విక్రమ్, సిబ్బంది అభినందించారు.

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు

కలెక్టరేట్, జనవరి 29 : జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి వి.శ్రీధర్ తెలిపారు. అపోలో ఫార్మసీ సంస్థలో ఫార్మాసిస్టు, ఫార్మసీ అసిస్టెంటు పోస్టులు వంద ఖాళీలు ఉన్నట్లు వెల్లడించారు. ఫార్మాసిస్టుకు డీఫార్మసీ, బీఫార్మసీ, ఎంఫార్మసీల్లో ఏదేని అర్హత కలిగి ఉండాలని, వేతనం రూ.25 వేల వరకు ఉంటుందని, ఫార్మసీ అసిస్టెంట్ పోస్టులకు డిగ్రీ వరకు చదివి ఉండాలని, వారికి రూ.20 వేల వరకు వేతనం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు గల ఔత్సాహికులు ఈనెల 31న నగరంలోని స్వశక్తి కళాశాల ఆవరణలో గల ఈజీఎంఎం కార్యాలయంలో ఉదయం 10 గంటలకు తమ బయోడేటా, ఆధార్‌కార్డు, విద్యార్హతల జిరాక్సు ప్రతులతో హాజరుకావాలని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

జాతీయ సమైక్యత శిబిరానికి విద్యార్థుల ఎంపిక

కమాన్‌చౌరస్తా, జనవరి 29 : జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్స్ సార్వ లావణ్య, కక్కెర్ల సాయిరాం జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. వచ్చేనెల 11 నుంచి 17 వరకు కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో జరిగే శిబిరానికి వలంటీర్లు హాజరవుతారని కాలేజ్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనపురి సాగర్ చెప్పారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్సును కళాశాల కరస్పాండెంట్ వి. ఆగం రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

ద్విచక్ర వాహనాల ర్యాలీ తీస్తున్న అధికారులు, తదితరులు

జగిత్యాల, జనవరి 29: బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత పిలుపునిచ్చారు. బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమాన్ని ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మిషన్ శక్తి పథకం, మహిళా సాధికారత కేంద్రం, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియం, పాత బస్టాండ్ నుంచి జిల్లా కార్యాలయ సముదాయం వరకు మహిళలు, బాలికలతో బైక్ ర్యాలీ తీశారు. అనంతరం బేటీ బచావో–బేటీ పడావో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే, జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించగా, అదనపు కలెక్టర్ బీఎస్ లత హాజరై మాట్లాడారు. బాల, బాలికల లింగ నిష్పత్తి సమానత్వం సాధించేలా కృషి చేస్తున్నామన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో వివిధ రంగాల్లో రాణిస్తున్న బాలికలు, మహిళలను సన్మానించారు. జిల్లా కార్యాలయాల సముదాయం ఆవరణలో అదనపు కలెక్టర్ బీఎస్ లత మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి నరేశ్, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, ఎస్సీ అభివృద్ధి అధికారి రాజ్ కుమార్, జిల్లా విద్యాధికారి కే రాము, ఐసీడీఎస్ సీడీపీవోలు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

పబ్లిక్ ప్రాసిక్యూటర్లను సన్మానిస్తున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 29: పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంతో పని చేసి నిందితులకు శిక్ష పడేలా చూడాలని ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. సంవత్సర కాలంలో 64 కేసుల్లో నిందితులకు జైలు శిక్ష పడేలా కృషి చేసిన జిల్లాకు చెందిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఎస్పీ అశోక్ కుమార్ బుధవారం తన చాంబర్‌లో సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, వివిధ ఘటనల్లో నమోదైన ఎఫ్ఐఆర్ నుంచి మొదలు కేసు విచారణలో పోలీసు అధికారులకు సూచనలు చేయడం, సాక్ష్యాలను సరైన పద్ధతిలో ప్రవేశపెట్టే పద్ధతి వంటి అనేక అంశాల్లో తగు జాగ్రత్తలు తీసుకుంటూ కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రధాన కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు విధించడంలో పీపీల పాత్ర అభినందనీయమన్నారు. నూతన చట్టాలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పలు సందేహాలను పోలీసులకు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మల్లికార్జున్, సీహెచ్ రామకృష్ణారావు, మల్లేశం, రాజేశ్, రజనీ, ప్రణయ్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జగిత్యాల, జనవరి 29: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్–540 ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను బుధవారం జిల్లా ఇంటర్ విద్యాధికారి నారాయణ ఆవిష్కరించారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ స్టేట్ కో–ఆర్డినేటర్ రాపాక రవీందర్, జిల్లా అధ్యక్షుడు రాజయ్య, కార్యదర్శి జానయ్య, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

జగిత్యాల టౌన్, జనవరి 29: జిల్లా కేంద్రంలోని మౌంట్ కార్మెల్ హైస్కూల్ విద్యార్థి మణిదీప్, గైడ్ టీచర్ కవిత, మెట్‌పల్లి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు వర్షిత, వాగ్దేవి, గైడ్ టీచర్ సతీశ్, ఉపాధ్యాయుడు అభయ్‌రాజ్ పుదుచ్చెరిలో ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు జరిగిన దక్షిణ భారత సైన్స్ ఫెస్టివల్‌లో ప్రతిభ చూపి బహుమతులు సాధించారు. కాగా, జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో బుధవారం విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులను కలెక్టర్ సత్యప్రసాద్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాము, మెట్‌పల్లి బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కనకతార పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

రాయికల్, జనవరి 29: మండల కేంద్రంలోని శ్రీ గ్రీన్‌వుడ్ పాఠశాల విద్యార్థులు రూ.16,100 జమచేసి గోదావరిఖనిలోని ఎండీహెచ్‌డబ్ల్యూఎస్ అర్బన్స్ హోమ్ అనాథ పిల్లల ఆశ్రమానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మిట్టపల్లి మహేశ్ రెడ్డి, డైరెక్టర్ కాకర శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ రాజేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కుట్టు మిషన్ అందజేత

ఇబ్రహీంపట్నం, జనవరి 29: మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యార్థులకు బుధవారం డాక్టర్ ఆనంద్ బాబు కుట్టు మిషన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నేమూరి సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్

మేడిపల్లి, జనవరి 29: కాంగ్రెస్ ఎన్నికల హామీలను విస్మరించిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరండ్ల మధుకర్, మండలాధ్యక్షుడు ముంజ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. నాలుగు పథకాల అమలును పక్కదోవ పట్టించడానికే గద్దర్ విషయాన్ని తెరపైకి తెచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయం చేస్తున్నదని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ సమావేశంలో నాయకులు జలపతిరెడ్డి, ఎస్ఎన్‌రెడ్డి, లింగారెడ్డి, జలంధర్‌రెడ్డి, సత్యనారాయణ, మధుసూదన్, రఘు, రమేశ్, శివ పాల్గొన్నారు.